సాక్షి చిత్తూరు

సోమవారం । 3 । ఫిబ్రవరి । 2025



బాలాలయ పూజలు

కాణిపాకంలోని శ్రీవీరాంజనేయ స్వామి ఆలయ పునఃనిర్మాణ పనుల్లో భాగంగా పూజలు నిర్వహించారు. - 8లో



నాగబాబు ఫ్లాప్ షో

పుంగనూరు నియోజక వర్గంలో నిర్వహించిన జనసేన సభ జనాలు లేక వెలవెల బోయింది. - 8లో



ఆర్‌ఎంపీ గ్యారేజ్!

జిల్లాలో కొందరు ఆర్‌ఎంపీలు చెలరేగిపోతున్నారు. స్థాయికి మించి వైద్యం చేసి రోగుల ప్రాణాలు తీస్తున్నారు. - 8లో



వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న పెద్దిరెడ్డి, భూమన తదితరులు

అరాచకాలు ఎండగడదాం

- వైఎస్సార్ సీపీ నేతలపై ఎల్లో మీడియా విషప్రచారం
- వైఎస్సార్‌సీపీలో పలువురు నేతలకు పదవులు
- అట్టహాసంగా ప్రమాణస్వీకారం

తిరుపతి మంగళం : అధికార దాహంతో నోటికి వచ్చినట్లుగా అబద్ధాలు చెప్పి, అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కూటమి నాయకులు చేస్తున్న అరాచకాలు, దౌర్జన్యాలను ఎండగడదామని వైఎస్సార్ సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి మారుతీనగర్‌లోని పెద్దిరెడ్డి నివాసం వద్ద ఆదివారం వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా, నగర, అనుబంధ విభాగాల్లో పదవులు పొందిన నాయకులు ప్రమాణస్వీకారం చేశారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, సతీష్‌రెడ్డి, సిపాయి సుబ్రమణ్యం, కేజేఆర్ భరత్, భూమన అభినయ్‌రెడ్డి, సునీల్, రాజేష్, వెంకటేగౌడ, కృపాలక్ష్మి, చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవులు అలంకారప్రాయం కాకుండా పార్టీ బలోపేతానికి దోహదపడేలా ఆ పదవులు పొందిన నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు అన్నీ కష్టాలేనన్నారు. ప్రజాసమస్యలపై ప్రతి కార్యకర్త పోరాటయోధుడై ఉద్యమించాలన్నారు. రాష్ట్రంలో ఇదివరకు ప్రజాసంక్షేమమే లక్ష్యంగా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారని గుర్తు చేశారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో కూడా సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న నియోజకవర్గ అధ్యక్షులు



కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు



మాట్లాడుతున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. చిత్రంలో భూమన కరుణాకరరెడ్డి

కార్యకర్తలే లక్ష్యంగా దాడులు

చంద్రబాబు కూటమి పాలన వచ్చిన నాటి నుంచి ప్రజాసంక్షేమాన్ని పక్కన పెట్టి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా దాడులకు పాల్పడుతూ, అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలవుతున్నా ఇంతవరకు ఏ ఒక్క హామీనీ నెరవేర్చిన పాపానపోలేదన్నారు. తల్లికి మొండి చేయి, తాగుబోతుకు ఫుల్ అందిస్తున్నారే తప్ప సంక్షేమ పథకాలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. చంద్రబాబు ఇచ్చిన హామీల అమలుపై ఎల్లో మీడియా ఎలాంటి వార్తలు రాయడం లేదని, ఎంతసేపు వైఎస్సార్ సీపీ నాయకులపై విషప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన నిలిచి, చంద్రబాబు మోసాలను ఎత్తిచూపాల్సిన ఎల్లో మీడియా వారికి కొమ్ముగాస్తుందన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా విద్యుత్ చార్జీలు పెంచారని, తల్లికి వందనం తగలపెట్టారని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తుంగలో తొక్కేశారన్నారు. చివరకు శ్రీవారి లడ్డూ విషయంలో కూడా రాజకీయం చేసిన నీచుడు చంద్రబాబు అన్నారు. అందుకే తిరుమలలో అన్ని అపచారాలు జరుగుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తిరుమల పవిత్రతను భ్రష్టుపట్టించారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, రాబోయే రోజుల్లో జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి సీఎం కావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వివిధ పదవులు పొందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 3వ తేదీన కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరంగా చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.


నేడు పోలీస్ గ్రీవెన్స్

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఆర్మ్‌డు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడుతామని ఎస్పీ తెలిపారు.

'పది' పరీక్షల పరిశీలకుడిగా నరసింహారావు

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షల పరిశీలకుడిగా రాష్ట్ర ఏపీఓఎస్‌ఎస్ శాఖ డైరెక్టర్ నరసింహారావును నియమించారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులు డీఈఓ కార్యాలయానికి చేరాయి. మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలను చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పకడ్బందీగా నిర్వహించేందుకు రాష్ట్ర విద్యాశాఖ అబ్జర్వర్‌ను నియమించింది.

జిల్లా ఆటోడ్రైవర్ యూనియన్ కార్యవర్గం ఏకగ్రీవం



నాగరాజు, మోహన్, విజయకుమార్

చిత్తూరు కార్పొరేషన్ : జిల్లా ఆటోడ్రైవర్ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వామన మూర్తి, వైస్ ప్రెసిడెంట్ శివకుమార్ ప్రకటించారు. ఆ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడిగా నాగరాజు, జిల్లా అధ్యక్షుడిగా మోహన్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్ ఎన్నికయ్యారు. అలాగే జిల్లా కోశాధికారిగా రఘు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వసంతరాయలు, జిల్లా ఉపాధ్యక్షుడిగా సత్యమూర్తి, విజయచందర్, రమేష్, నూర్, వెంకటేష్, ఉదయ్ కుమార్, ఆదినారాయణ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికైన నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ.. జిల్లాలోని ఆటోడ్రైవర్ల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. సంఘం బలోపేతానికి చర్యలు చేపడుతామని వెల్లడించారు. ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు మూడు సంవత్సరాల పాటు పదవీ కాలంలో ఉంటారని తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

రక్తసిక్తం!

జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- ప్రయివేటు బస్సును ఢీకొట్టిన గుర్తుతెలియని వాహనం
- నలుగురు మృతి
- నిశీధిలో ప్రయాణికుల హాహాకారాలు
- ఒకరి పరిస్థితి విషమం, నలుగురికి తీవ్రగాయాలు
- మరో 8 మందికి స్వల్ప గాయాలు
- క్షతగాత్రులతో నిండిపోయిన నగరి ఏరియా ఆస్పత్రి

ఆదివారం సెలవులకని వెళ్లివారు కొందరు, పెళ్లిళ్లకు, ఇతర వేడుకలకు వెళ్లినవారు మరి కొందరు.. తిరుమలేశుడి దర్శనానికి వస్తున్న వారు ఇంకొందరు.. ఇలా అందరూ ఆ బస్సులోనే బయల్దేరారు. బస్సు కూడా ఎక్కేశాం.. ఇక హాయిగా గమ్యం చేరొచ్చని భావించారు. కానీ క్షణాల్లో ధాం అంటూ పెద్ద శబ్దం వచ్చింది. బస్సు ఒక్కసారిగా కుదుపునకు గురైంది. వెనుక కూర్చున్న నలుగురి ప్రాణాల్లో రెప్పపాటులో గాల్లో కలిసిపోయాయి. మరో నలుగురు రక్తగాయాలతో తడిసి ముద్దయ్యారు. ఇంకో ఎనిమిది మంది బస్సులోనే కుప్పకూలిపోయారు. వారిని చూసి ప్రయాణికులు హాహాకారాలు పెట్టారు. మొదలే చీకటి.. ఆపై పెను ప్రమాదం.. ఏం చేయాలో దిక్కుతోచక గుండెలు బాదుకుంటూ కన్నీళ్లు పెట్టారు. ఈ విషాద ఘటన నగరి మున్సిపల్ పరిధి, టూరిజం రెస్టారెంట్ సమీపం, జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి చోటుచేసుకుంది.

నగరి : నగరి సమీపంలో ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఓ ప్రయివేటు బస్సును గుర్తుతెలియని భారీ వాహనం పక్క నుంచి ఢీకొట్టిడంతో పెను ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో నలుగురు మృత్యుఒడికి చేరారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మరో 8 మంది స్వల్పంగా గాయపడ్డారు. వివరాలు.. నగరి మున్సిపల్ పరిధి టూరిజం రెస్టారెంట్ సమీపం, జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి నగరి నుంచి తిరుపతికి వెళుతున్న ప్రైవేటు బస్సును గుర్తు తెలియని భారీ వాహనం పక్క నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వడమాలపేట సీతారామాపురం గ్రామానికి చెందిన పార్థసారథి నాయుడు (62), రాజేంద్రనాయుడు (60), తిరుపతికి చెందిన దినేష్ (8), తిరుత్తణికి చెందిన కుమార్ (60) మృతిచెందారు. తమిళనాడు తిరువళ్లూరుకు చెందిన చెన్నామలై (55) పరిస్థితి విషమంగా ఉండగా, తిరుపతికి చెందిన సుబ్బరత్నమ్మ (42), భరత్ (40), తిరువళ్లూరుకు చెందిన సుధాకర్ (50) తీవ్రంగా గాయపడ్డారు. తిరుపతికి చెందిన రాధాకృష్ణ, శెల్వి, నాగేంద్ర, ఊత్తుకోటకు చెందిన కె.మురళి, తిరువళ్లూరుకు చెందిన రుద్రమూర్తి, శివగిరికి చెందిన అనురాధ స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యసేవల కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు.



ప్రమాదానికి గురైన బస్సు

వేగంగా స్పందించిన వైద్యులు

క్షతగాత్రులకు వేగంగా వైద్యసేవలందించడంతో ఏరియా ఆస్పత్రి వైద్యులు ప్రశంసలు అందుకున్నారు. మెడికల్ సూపరింటెండెంట్, ఆర్ఎంవో, వైద్యులు అందరూ హుటాహుటిన ఆస్పత్రికి చేరుకొని వైద్యసేవలందించారు. పోలీసులు కేసు నమోదుచేసి ఢీకొన్న వాహనం కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



విలపిస్తున్న ప్రయాణికులు



ధ్వంసమైన బస్సు

రక్తంతో తడిసి ముద్దయిన నగరి ఆస్పత్రి



క్షతగాత్రులకు రుయాకు తరలిస్తున్న వైద్యసిబ్బంది

క్షతగాత్రుల తీవ్ర గాయాలతో ఆస్పత్రికి చేరుకోవడం.. వారిని స్ట్రెచర్లలో అటూ ఇటూ తీసుకెళ్లడంతో వార్డులంతా రక్తసిక్తమైంది. ఆ ప్రాంతంలో ఉన్నవారు అక్కడి పరిస్థితిని చూసి తట్టుకోలేక బయటకు పరుగులు తీశారు.



పరిస్థితి విషమంగా ఉన్న చెన్నామలై



తీవ్రగాయాలపాలైన సుబ్బరత్నమ్మ

అతివేగమే కారణం!

అతివేగమే ప్రమాదానికి కారణమని బస్సులోని ప్రయాణికులు తెలిపారు. బస్సు వేగంగా వెళ్లి ఎదురుగా వస్తున్న వాహనాన్ని అదుపు తప్పించే ప్రయత్నంలో పక్కకు తిరగడం ఒక్కసారిగా ఏదో వాహనం గుద్దినట్లు ధాం అని పెద్ద శబ్దం వచ్చిందని బస్సు అద్దాలన్నీ పగిలి అందరూ చిందరవందరగా పడిపోయామని తెలిపారు. ప్రతిరోజూ టైమింగ్‌కు వెళ్లాలంటూ ప్రైవేటు బస్సులు వేగంగానే వెళుతున్నాయని వారు ఆరోపించారు.

నాన్నా లేరా అమ్మని వచ్చాను!

నాన్నా లేరా అమ్మని వచ్చాను..! అంటూ ఓ బాలుడి మృతదేహం వద్ద తల్లి పడిన ఆరాటం కదిలించింది. బిడ్డా కానరాని లోకాలకు వెళ్లిపోయావా..? అంటూ కన్నీరుపెట్టం అందరినీ కలచివేసింది. బస్సులో తన ఒడిలో పడుకొని నిద్రిస్తూ వచ్చిన కుమారుడు శాశ్వత నిద్రలోకి వెళ్లిపోవడం తట్టుకోలేక ఆమె స్పృహ తప్పిపడిపోవడంతో వైద్యులు ప్రత్యేక వైద్యచికిత్స అందించారు.



విలపిస్తున్న మృతుడు దినేష్ తల్లి



మృతులు పార్థసారథి నాయుడు, రాజేంద్రనాయుడు, దినేష్, కుమార్

క్షతగాత్రులను కాపాడితే రూ.5 వేలు



నిత్యబాబు, సీఐ

చిత్తూరు అర్బన్ : రోడ్డు ప్రమాదాల బారిన పడిన క్షతగాత్రులను కాపాడి, ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని సమీపంలోని ఆసుపత్రుల్లో చేర్పిస్తే.. అలాంటి వారికి రూ.5 వేల బహుమతి అందిస్తామని చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. కేంద్ర మోటారు యాక్టులోని సెక్షన్ 134 (ఏ), 2019 చట్టం దీనిపై ఇప్పటికే స్పష్టత ఇచ్చిందన్నారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ వాళ్లను ఆసుపత్రులకు తీసుకెళ్లి, ప్రాణాలను నిలబెట్టాలనే ఉద్దేశంతో ఈ చట్టాన్ని రూపొందించారన్నారు. ఇలా ఆసుపత్రికి తీసుకెళ్లిన వాళ్లు, అక్కడి డాక్టర్‌కు వారి వివరాలను ఇవ్వాలన్నారు. వీళ్లను ఎలాంటి పరిస్థితుల్లో కేసుల్లో భాగం చేయబోమని, కోర్టులకు సాక్షులుగా పిలవబోమన్నారు. ప్రాణాలు కాపాడిన వ్యక్తుల వివరాలు సేకరించి కలెక్టర్‌కు సమాచారం ఇస్తామన్నారు. కలెక్టర్ నుంచి కేంద్రం ప్రకటించిన రూ.5 వేల బహుమతితో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేస్తామన్నారు.

4న వర్చువల్ ఓరియంటేషన్

చిత్తూరు కలెక్టరేట్ : పర్యావరణం, సామాజిక వ్యవస్థల మూల్యాంకనం అంశంపై ఈనెల 4వ తేదీన వర్చువల్ ఓరియంటేషన్ ఉంటుందని రాష్ట్ర సమగ్రశిక్ష శాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులు జిల్లా సమగ్రశిక్ష కార్యాలయానికి చేరాయి. ఈనెల 4వ తేదీ ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఓరియంటేషన్ కార్యక్రమానికి ఎంఈఓలు, హెచ్ఎంలు హాజరయ్యేలా చర్యలు చేపట్టాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు.

6 నుంచి వర్డ్ ఫర్ చాంపియన్‌షిప్ పోటీలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో వర్డ్ ఫర్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించాలని రాష్ట్ర సమగ్రశిక్ష శాఖ అధికారులు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆ ఉత్తర్వుల మేరకు జిల్లాలోని 2వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు వర్డ్ పవర్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించాలన్నారు. ఈ పోటీలను ఈ నెల 6వ తేదీ నుంచి మార్చి 7వ తేదీ వరకు సంబంధిత షెడ్యూల్ మేరకు చేపట్టాలని ఆదేశించారు.

11న యూడైస్ ప్లస్ వర్క్‌షాప్

చిత్తూరు కలెక్టరేట్ : యూడైస్ ప్లస్‌లో వ్యత్యాసాలను సరి చేసేందుకు ఈనెల 11 వ తేదీన యూడైస్ ప్లస్ వర్క్‌షాప్‌ను నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు డీఈఓ కార్యాలయానికి ఉత్తర్వులు పంపారు. ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే యూడైస్ కసరత్తులో వ్యత్యాసాలు ఏర్పడ్డాయి. వీటిని సరిచేసేందుకు ఈనెల 11 వ తేదీన విజయవాడలో వర్క్‌షాప్ నిర్వహించనున్నారు. ఆ వర్క్‌షాప్ కు చిత్తూరు జిల్లాకు సంబంధించి తగిన నివేదికలతో హాజరు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.

టీటీడీకి కూరగాయల వితరణ



పలమనేరు : కర్ణాటక రాష్ట్రం వడ్డిపల్లి కూరగాయల మార్కెట్ నుంచి శ్రీవారి భక్తులు రథ సప్తమి సందర్భంగా టీటీడీ నిత్యాన్నదాన పథకానికి పది టన్నుల కూరగాయలను ఆదివారం టీటీడీ వాహనంలో తరలించారు. ఆ వాహనానికి పూజలు చేసి గోవిందనామ స్మరణల మధ్య అక్కడి నుంచి తిరుమలకు తరలించారు. కార్యక్రమంలో స్థానిక శ్రీవారి భక్తులు కాబ్బల్లి రవీంద్రారెడ్డి మిత్ర బృందం పాల్గొన్నారు. దాతకు వీరు కృతజ్ఞతలను తెలిపారు.

క్లుప్తంగా

జర్నలిస్టుల సమస్యలపై పోరాడాలి


మాట్లాడుతున్న ఐవీ సుబ్బారావు

కాణిపాకం: జర్నలిస్టు సమస్యలపై పోరాటం చేయాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు పిలుపునిచ్చారు. కాణిపాకంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం ఏపీయూడబ్ల్యూజే చిత్తూరు, తిరుపతి జిల్లాల విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు లోకనాథం అధ్యక్షతన నిర్వహించారు. దీనికి సుబ్బారావుతో పాటు ఎమ్మెల్యే మురళీమోహన్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అక్కులప్ప, రాష్ట్ర కార్యదర్శి రామ సుబ్బారెడ్డి, తిరుపతి అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు అక్కులప్ప, జిల్లా నాయకులు మురళీకృష్ణ, అశోక్‌కుమార్, చిత్తూరు, తిరుపతి క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మురళీ, బాలచంద్ర, రమేష్, కాశీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగబాబు.. ఫ్లాప్ షో

పుంగనూరు : జనసేన పార్టీ కార్యదర్శి, పవన్ కల్యాణ్ సోదరుడు నాగబాబు పుంగనూరు నియోజకవర్గంలో సోమలలో ఆదివారం నిర్వహించిన సభ ఫ్లాప్ అయింది. తన పార్టీ లీడర్లు, కార్యకర్తలను కూడా నాగబాబు కలవలేదు. ఆయనను కలవాలని ఎదురుచూసిన జనసైనికులకు తీవ్ర నిరాశ ఎదురైంది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి ఎమ్మెల్యే జంగాలపల్లి శ్రీనివాసులు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ నాయకులు కూటమి ప్రభుత్వంపై కుక్కల్లా ఆరోపణలు చేస్తూ, నానా యాగి చేస్తున్నారంటూ మండిపడ్డారు. అసెంబ్లీకి వెళ్లని ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామాలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డిపై నాగబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. అక్రమాలపై నిజనిర్ధారణ కమిటీ వేస్తామని స్పష్టం చేశారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 6 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 80,871 మంది స్వామివారిని దర్శించుకోగా 24,257 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.78 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఆర్‌ఎంపీ గ్యారేజ్ !

ఇక్కడ అన్ని రోగాలు చూడబడును, మందులు అమ్మబడును

ఆర్‌ఎంపీ క్లినిక్‌లో జిల్లా వైద్యాధికారుల తనిఖీ (ఫైల్)



- చిత్తూరు మండలానికి చెందిన పాపమ్మ (67) వృద్ధాప్యం కారణంగా మంచం పట్టింది. నడవడం కష్టం. ఇలాంటి తరుణంలో గ్రామానికి నిత్యం వచ్చే ఓ ఆర్‌ఎంపీ ద్వారా చికిత్స చేయించుకునేది. కడుపు నొప్పి, జ్వరం వచ్చినా ఆ ఆర్‌ఎంపీని పిలిపించుకునేది. నొప్పి త్వరగా పోయేందుకు ఆ తరచూ పెయిన్ కిల్లర్స్ ఇంజెక్షన్ ఇచ్చేవాడు. అధిక డోస్ మాత్రలు ఇచ్చి వెళ్లేవాడు. అవి ఆమెకు నొప్పుల బారి నుంచి ఉపశమనం లభించేది. అయితే కొన్నాళ్లకే కిడ్నీలు దెబ్బతిన్నాయి. ఆ తర్వాత పెద్దాస్పత్రిలో చికిత్స తీసుకున్నా ఉపయోగం లేక కొన్నాళ్లకే మృతి చెందింది.

- కార్వేటి నగరానికి చెందిన రామయ్య విపరీతమైన తలనొప్పి అని నగరిలోని ఓ ఆర్‌ఎంపీ వద్దకు వెళ్లాడు. ఆ ఆర్‌ఎంపీ తలనొప్పికి బదులు..డయాబెటీస్(షుగర్) మాత్రలు ఇచ్చాడు. ఆ మాత్రలు మింగిన ఆ వ్యక్తికి షుగర్ లెవల్స్ పడిపోయాయి. పరిస్థితి ఇబ్బంది కరంగా మారితే తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. తీరా విచారిస్తే అతను మింగింది..తలనొప్పి మాత్రలు కాదని..షుగర్ మాత్రలని తేలింది.

- నకిలీ వైద్యంతో పాటు మందులు, మాత్రల బిజినెస్
- జిల్లాలో కొందరి ఆర్‌ఎంపీల హవా..
- ఆర్‌ఎంపీల వద్దకు క్యూకడుతున్న మెడికల్ ఏజెన్సీలు, వ్యాపారులు
- బహిరంగంగా కొనుగోలు, అమ్మకాలు
- రోజుకు రూ. 10 లక్షలకుపైగా వ్యాపారం
- పట్టించుకోని ఔషధ నియంత్రణ అధికారులు
- పర్యవేక్షణ లేని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో కొందరు ఆర్‌ఎంపీలు వైద్యుల అవతారమెత్తారు. స్థాయికి మించి వైద్యంతో పాటు మందులు, మాత్రల వ్యాపారం అడ్డగోలుగా చేస్తున్నారు. ఈ ధందాను మెడికల్ ఏజెన్సీలు, వ్యాపారులు పెంచి పోషిస్తున్నారు. బహిరంగంగా కొనుగోలు, అమ్మకాలు లావాదేవీలు నడుస్తున్నాయి. నిత్యం రూ. 10 లక్షలకు పైగా వ్యాపారం సాగుతోంది. క్లినిక్ అంతా ఆ మందులు, మాత్రలను పరిచి ఇష్టానుసారంగా అమాయక ప్రజలకు అంటగడుతున్నారు. అయినా జిల్లా ఔషధ నియంత్రణ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెలువెత్తుతున్నాయి.

ధనార్జనే ధ్యేయంగా..

జిల్లాలో ఆర్‌ఎంపీలదే హవా నడుస్తోంది. 2500 మందికి పైగా జిల్లా నలుమూలలా పాగా వేశారు. సరిహద్దులో అధిక సంఖ్యలో ఉన్నారు. వీరిలో కొందరు నిబంధనలను పక్కన పెట్టి నకిలీ వైద్యానికి పదును పెట్టారు. మనిషి ఆరోగ్య రక్షణను పక్కన పెట్టి...ధనార్జనే ధ్యేయంగా విజృంభిస్తున్నారు. నకిలీ వైద్యంతో పాటు చట్ట విరుద్ధంగా మందులు, మాత్రల అమ్మకాలను బహిరంగంగా చేసుకుంటున్నారు.

చట్ట విరుద్ధంగా నిర్వహణ..ఏజెన్సీల పాత్ర

మెడికల్ షాప్ నిర్వహణకు ప్రధానంగా ఫార్మాసిస్ట్ పూర్తి చేసిన సర్టిఫికెట్ ఉండాలి. షాపు పెడుతున్నట్లు ఔషధ నియంత్రణ శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. ఆ దరఖాస్తును శాఖ అధికారులు నిశితంగా పరిశీలించి అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. ఇవేవీ పట్టనట్లు ఆర్‌ఎంపీలు వ్యవహరిస్తున్నారు. ఆ నిబంధనలను పక్కన పెట్టి క్లినిక్‌లోనే మందులు, మాత్రలు విక్రయిస్తున్నారు. వీళ్లకు మందులు, మాత్రలను కొన్ని మెడికల్ ఏజెన్సీలు యథేచ్ఛగా విక్రయిస్తున్నాయి. ఇలా అక్రమ వ్యాపారం చేస్తూ..జీఎస్టీ, సేల్స్ ట్యాక్స్‌లను సైతం ఎగ్గొడుతున్నాయి. కొంత మంది ఆర్‌ఎంపీలు నేరుగా ఏజెన్సీల వద్దకే వెళ్లి మందులు, మాత్రలు తెచ్చుకుంటున్నారు. ఇక మెడికల్ రెప్రజెంట్‌లు సైతం ఆర్‌ఎంపీ వద్దకు క్యూకడుతున్నారు. సరిహద్దులోని ఆర్‌ఎంపీలు తమిళనాడులోని వేలూరు, చెన్నై, బెంగుళూరులో తక్కువ ధరకే మందులు, మాత్రలు తెచ్చుకుంటున్నారు. చాలా బ్రాండ్‌లు వాళ్ల దగ్గర మాత్రమే దొరుకుతాయి. మిగిలిన వాళ్ల దగ్గర వెళితే ఆ బ్రాండ్లు కూడా దొరకవు. జిల్లాలో ఈ మందులు, మాత్రల విక్రయాలు చట్ట విరుద్ధంగా నడుస్తున్నా పట్టించుకోనే వారు లేకపోవడంతో కొందరు ఆర్‌ఎంపీలు హద్దుమీరి ప్రవర్తిస్తున్నారు. నిబంధనలు అతిక్రమిస్తున్న వీరిపై చట్ట ప్రకారం క్రిమినల్ కేసులు పెట్టవచ్చు. అలాగే మందులు, మాత్రలు విక్రయించే ఏజెన్సీల లైసెన్స్‌ను కూడా రద్దు చేసి కేసు పెట్టే అధికారం ఉంది. కానీ శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

ఆర్‌ఎంపీ క్లినిక్‌లోనే మెడికల్ షాపులు

జిల్లా వ్యాప్తంగా 1100 షాపులున్నాయి. ఈ షాపులకు 52 మెడికల్ ఏజెన్సీల ద్వారా మందులు, మాత్రలు సరఫరా అవుతున్నాయి. అలాగే కంపెనీకి ఇద్దరు చొప్పున మెడికల్ రిప్రజెంట్లు తిరుగుతూ విక్రయాలు చేసుకుంటున్నారని ఏజెన్సీదారులు అంటున్నారు. ఇలా నిత్యం రూ. 20 లక్షల నుంచి 25 లక్షల వరకు వ్యాపారం జరుగుతున్నట్లు ఏజెన్సీలు గణంకాలు చెబుతున్నాయి. ఇంత వరకు బాగానే ఉన్న ఆర్‌ఎంపీలు ఇష్టారాజ్యంగా మందులు, మాత్రలు అమ్మకాలు చేసుకుంటూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంపై ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి.


కుప్పంలోని ఓ ఆర్‌ఎంపీ క్లినిక్‌లో మందులు, మాత్రలు

తప్పులతడకగా...

ఆర్‌ఎంపీల వద్దకు పురిటి బిడ్డల నుంచి వృద్ధుల వరకు క్యూకడుతుంటారు. వారికి చికిత్స చేయడంతో పాటు మందులు, మాత్రలను చకచకా ఇచ్చేస్తుంటారు. ఇంజెక్షన్లు, సెలైన్లు, ఆపరేషన్లు, డెలివరీలు చూస్తుంటారు. ఈక్రమంలో చాలా చోట్ల వారి వైద్యం వికటించి ప్రాణాలు పోతున్నాయి. ప్రాణాలు పోతున్న వారిలో పిల్లలు, వృద్ధుల సంఖ్య అధికంగా ఉంది. ఇంజెక్షన్లు, మందులు, మాత్రలు ఇష్టానుసారంగా ఇవ్వడం వల్ల జిల్లాలో ఘోరం జరుగుతున్నట్లు పలు చోట్ల ఫిర్యాదులు, కేసులున్నాయి. ఇక తప్పుల తడకగా మాత్రలు ఇవ్వడంతో అమాయక ప్రజలు అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. అధిక డోసేజ్ మాత్రలు, ఇంజెక్షన్లు ఇవ్వడం వల్ల కిడ్నీలు దెబ్బతింటున్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. కిడ్నీ బాధితుల సంఖ్య అధికంగా పల్లెల్లోనే ఉన్నారని నిపుణుల పరిశీలనలో తేలింది. దీనిపై శాఖ అధికారులు స్పందించి కట్టడి చేయకపోతే మరిన్ని ప్రాణాలకు ముప్పు తప్పదు.

నిబంధనలకు విరుద్ధంగా పెడితే కేసులు

మెడికల్ షాపు, ఏజెన్సీలు కచ్చితంగా మందులు, మాత్రల విక్రయాల్లో నిబంధనలు పాటించాలి. విరుద్ధంగా వ్యవహరించవద్దు. అలా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. లైసెన్స్ ఉంటేనే మందులు, మాత్రలు విక్రయించాలనే విషయాన్ని గుర్తించాలి. దీనిపై గట్టిగా దాడులు చేస్తాం. పట్టుబడితే కేసులు పెడుతాం.

– హరిప్రసాద్, ఔషధ నియంత్రణ శాఖ ఏడీ, తిరుపతి

ఫీజు పోరుకు పిలుపు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డా.సునీల్‌కుమార్

మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈనెల 5న ఫీజుపోరు ధర్నా చేపడుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే డా.సునీల్ కుమార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాలేరులో ఫీజు పోరు సభ పోస్టర్లను ఆయన ఆవిష్కరించి, సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. – బంగారుపాళెం

రుణదాతల వేధింపులు తాళలేక..

రైతు ఆత్మహత్యాయత్నం


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జయచంద్ర

పుంగనూరు : రుణదాతల వేధింపులు తాళలేక మండలంలోని వనమలదిన్నెకి చెందిన జయచంద్ర (38) అనే రైతు శనివారం రాత్రి పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన జయచంద్ర వ్యవసాయం చేసి కుటుంబాన్ని పోసించేవాడు. పంటల సాగు కోసం సుమారు రూ.10 లక్షల మేర అప్పులు చేశాడు. పంటకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టిన పెట్టుబడులు రాకపోవడంతో అప్పులు అధికమయ్యాయి. మరోవైపు రుణదాతల వేధింపులు తీవ్రం కావడంతో గత్యంతరం లేక మనస్తాపానికి గురైన జయచంద్ర ఇంట్లోనే పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జయచంద్రను వెంటనే మదనపల్లె ఆసుపత్రికి తరలించారు. అక్కడే ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

కోట : హత్య కేసు నిందితుడు కొమారి మస్తానయ్యను ఆదివారం అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు వాకాడు సీఐ హుస్సేన్‌బాష తెలిపారు. జరుగుమల్లిలో అన్నదమ్ముల మధ్య తలెత్తిన వివాదం కారణంగా అన్న కోటయ్యను తమ్ముడు మస్తానయ్య రోకలి బండతో కొట్టి హత్య చేసినట్లు తెలిపారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు కోట దళితవాడ వద్ద నిందితుడిని పట్టుకోవడం జరిగిందన్నారు.

ఆగమోక్తంగా బాలాలయ పూజలు

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో ఆదివారం బాలాలయ పూజలు అత్యంత వైభవంగా కొనసాగాయి. శ్రీ వీరాంజనేయస్వామి ఆలయ పునఃనిర్మాణ పనుల్లో భాగంగా బాలాలయ పూజలను పండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. విశ్వక్సేన ఆరాధన, మూలమూర్తికి నవకలశ్నపనం, కలశ స్థాపన, అగ్ని ప్రతిష్ఠ హోమం, బాలాలయ స్వామి వారికి ఛాయాదివాసం, హనుమంత హోమం తదితర పూజలను విశేషంగా చేపట్టారు. ఈ పూజకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రవీంద్రబాబు, సిబ్బంది కోదండపాణి, వాసు, రవి తదితరులు పాల్గొన్నారు.

కూటమిలో నిధుల కుంపటి!



"మనమంతా ఐక్యంగా ఉండాల్సిన సమయం వచ్చింది. మనలో మనకు జగడాలు పెట్టేదానికి మన పార్టీలోని కొందరు విభజించు, పాలించు అన్నట్లు చేస్తా ఉండారు. ఎన్నికల్లో నా గెలుపు కోసం పని చేయని వాళ్లు వీరు.. నాకు తెలుసు..! ఫండ్స్ తెచ్చుకుని నాకు చెప్పకుండానే నియోజకవర్గంలో పనిచేస్తా ఉండారు. అదే అన్‌రిజర్వు ఎమ్మెల్యేల వద్ద ఇట్లా చేస్తారా..? దీనిపై మీ అందరి మద్దతు కావాలి. ఇంకోసారి నా నియోజకవర్గంలో చేయి పెడితే ఎవర్నీ ఉపేక్షించను."

– టీడీపీ నేతలతో మరో కూటమి ఎమ్మెల్యే

"చూడు నా, ఇది పద్ధతిగా లేదు.. నా నియోజకవర్గంలో నీ పెత్తనం ఏంది..? నేను వద్దనుకుంటే నీకు ఎంపీ దక్కింది. ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాలకు రూ.కోట్లు ఇచ్చినా. నీ వద్ద చేయి చాపాల్సిన అవసరం నాకులేదు. ఇప్పుడు నా నియోజకవర్గంలో ఓ గ్రూపునకు నువ్వు నాకు చెప్పకుండా ఎంపీ నిధులు ఎట్లా ఇస్తావా..? ఇది ఏమీ బాగాలేదు.."

– చిత్తూరు జిల్లాలో కూటమి పార్టీ ఎమ్మెల్యే ఒకరు

- ఎంపీ, ఎమ్మెల్యేల మధ్య జగడం
- మమ్మల్ని అడగకుండా నిధులెలా ఇస్తారు ?
- ఎంపీ నిధుల విడుదలపై ఎమ్మెల్యేల అసహనం
- దీటుగా జవాబిస్తున్న ఎంపీ
- సీఎంకు చేరనున్న పంచాయతీ

చిత్తూరు అర్బన్ : చిత్తూరు జిల్లాలోని తెలుగుదేశం పార్టీలో నిధుల కుంపటి రగులుకుంది. ఈ వేడి కూటమి పార్టీకి చెందిన అధికారపార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీ మధ్య అగ్గిని రాజేస్తోంది. పది మంది ముందు ఒకరినొకరు పలకరించుకుని, బుజాలు రాసుకున్నా.. అవన్నీ పైకేనని, ఆలింగనం ధృతరాష్ట్రుడి కౌగిలేనని తెలుగు తమ్ముళ్లు స్పష్టం చేస్తున్నారు. ఎంపీ నిధుల విడుదలలో నెలకొన్న విభేదాలే.. ఈ వివాదానికి కారణంగా చెబుతున్నారు. ప్రధానంగా జిల్లాలోని ముగ్గురు కూటమి ఎమ్మెల్యేలు.. ఎంపీపై కాలు దువ్వుతుంటే, తానేమీ తగ్గేదేలేదంటూ ఎంపీ కూడా 'సై' అంటున్నారు.

ఎవరిని అడిగి ఇస్తున్నారు..?

పార్లమెంటు సభ్యుడు ఎంపీ నిధుల ద్వారా ఏ ప్రాంతం అభివృద్ధికైనా నిధులు కేటాయించొచ్చు. దీనికి ఎవరి అనుమతి తీసుకోవాల్సిన అవసరం ఉండదు. రోడ్లు, కాలువల నుంచి తాగునీరు, మౌలిక వసతులు, సదుపాయాల కోసం ఎంపీ నిధులను వెచ్చించవచ్చు. నిధులు కేటాయించిన తరువాత, ఆ పనులపై కలెక్టర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారు. చిత్తూరు జిల్లాలోని గంగాధర నెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, చంద్రగిరి నియోజకవర్గాల్లోని కొందరు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎంపీ నిధుల నుంచి పనులను చేయడానికి దగ్గుమళ్ల నుంచి నిధులు కేటాయించుకున్నారు. పనులు పూర్తి చేసి, అందులో వచ్చిన లాభాలను జేబులో వేసుకుందామని ఎంపీ వద్దకు క్యూ కట్టారు. ఎంపీ తన పరిధిలోని నాలుగు నియోజకవర్గాల్లో పనులు చేయడానికి నిధులను కేటాయిస్తూ ఆ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడే సమస్య తలెత్తింది. ఎవరిమటుకు వాళ్లు నేరుగా ఎంపీని కలవడం, ఆయన నుంచి నిధులు తెప్పించుకుని పనులు చేయడం ప్రారంభించారు. ఇది కొందరి ఎమ్మెల్యేల గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లయ్యింది. నియోజకవర్గ ఎమ్మెల్యేను సంప్రదించకుండా, ఎంపీ నిధుల ద్వారా పనులు కేటాయిస్తూ నిర్ణయాలు ఎలా తీసుకుంటారని బహిరంగంగానే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎంపీ వర్గం ఘాటుగా సమాధానమిస్తోంది. నియోజకవర్గాల్లోని కూటమి నేతలకు కమిషన్లు రావడంలేదనే ఎలా ఎంపీని ఇబ్బంది పెడుతున్నారని తిప్పి కొడుతున్నారు. 'ఎంపీను ప్రశ్నించే అధికారం ఎమ్మెల్యేలకు లేదని.. ఏదైనా ఉంటే బాబు గారితో (సీఎం) మాట్లాడుకోమను' అని ఎంపీ కూడా తన అనుచరుల వద్ద గట్టిగానే చెప్పినట్లు సమాచారం.

నిలిచిన పనులు..

చిత్తూరు పార్లమెంటు పరిధిలో గత ఆర్నెళ్ల కాలంలో ఎంపీ నిధుల నుంచి 88 పనులు చేయడానికి ప్రతిపాదనలు కలెక్టర్‌కు చేరాయి. దీనికోసం రూ.4.81 కోట్లు ఎంపీ నిధులు కేటాయించారు. అయితే ఇప్పటి వరకు కేవలం 26 పనులు పూర్తయితే, 22 పనులు పలు దశల్లో ఉన్నాయి. 40 వరకు పనులు అసలు ప్రారంభించలేదు. రూ.4.81 కోట్లలో ఇప్పటి వరకు రూ.72.91 లక్షలు మాత్రమే ఖర్చు పెట్టారు. అంటే సగానికి పైగా ఎంపీ నిధుల్లో పనులు ఇంకా మొదలు పెట్టలేదు. కూటమి పార్టీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు, ఎంపీ మధ్య నెలకొన్న విభేదాలు అభివృద్ధి పనులను ఎలా అడ్డుకుంటోందో ఈ గణాంకాలే నిదర్శనం. నేతల మధ్య నెలకొన్న ఈ అహం చివరికి ఎలాంటి ఫలితాన్ని ఇస్తుందో..? ప్రజలకు మౌలిక వసతులు కల్పించకుండా నిర్లక్ష్యం చేయడంపై నాయకులు ఏం సమాధానం చెబుతారో..? వేచి చూడాల్సిందే.

తపాలా.. ధరలు 'మోదీ'

- పోస్టల్ చార్జీలు భారీగా పెంపు
- పుస్తక ప్రియులపై పిడుగు
- తపాలాసేవలు ఇక ప్రియం
- కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ


చిత్తూరులోని తపాలా కార్యాలయం

చిత్తూరు కార్పొరేషన్ : బుక్‌పోస్ట్ సర్వీసుల రుసుం పెంపు పుస్తక ప్రియుల పాలిట శరాఘాతమైంది. ఈ సర్వీసుకు మోదీ సర్కార్ ధరల మోత మోగించింది. ఉత్తరాలు, మనియార్డర్ల బట్వాడా నుంచి బ్యాంకింగ్ సేవల వరకు దశల వారీగా విస్తరిస్తూ వచ్చిన తపాలాశాఖ బుక్‌పోస్ట్‌పై భారీగా షాక్ ఇచ్చింది. దీంతో వార, పక్ష, ఆధ్యాత్మిక పుస్తకాల బట్వాడపై ధరల మంట మండింది.

బుక్ పోస్ట్ సర్వీసు పేరుతో ఇంత కాలం అతి తక్కువ ధరకే కోరుకున్న పుస్తకాన్ని పాఠకుడికి అందజేసేవారు. తాజాగా మూడు రకాల బుక్ పోస్ట్ సేవలను ఒకే విభాగం కిందకు తెస్తూ రిజిస్టర్ ప్రింటెడ్ బుక్ పోస్ట్‌ను 'బుక్‌పోస్టు'గా మార్చి సేవల చార్జీ పెంచారు. ఈ క్రమంలోనే నాలుగు రకాలుగా ఉన్న పోస్ట్ కార్డులను ఒకే విభాగం కిందకు తెచ్చారు. రిజిస్టర్ బుక్ పోస్ట్ కాలమ్‌ను గత ఏడాది డిసెంబర్ 18 నుంచి ఏకంగా సాఫ్ట్‌వేర్ నుంచి రహస్యంగా తొలగించడం తపాలా ఉద్యోగులతో పాటు అందరినీ షాక్ గురి చేసింది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం పుస్తకాలతో పాటు దిన, వార, పక్ష పత్రికల బట్వాడా పై తీవ్ర ప్రభావం చూపనుంది.

ప్రైవేటు సేవలతో పోలిస్తే..

ప్రైవేటు కొరియర్ సర్వీసులతో పోలిస్తే ఇప్పటి వరకూ తపాలా శాఖ చాలా తక్కువ ధరలతో తరలింపు సేవలు అందిస్తోంది. కానీ నూతన కఠిన నిర్ణయాలతో ప్రైవేటు కొరియర్ సేవలే మేలనే పరిస్థితి వచ్చిందని వినియోగదారులు అంటున్నారు. తాము ఫోన్ చేస్తే చాలు పబ్లిషర్లు ఇంటికే పుస్తకాలు పంపుతున్నారని గుర్తు చేసుకుంటున్నారు. దేశంలో ఏ మారుమూల ప్రాంతం నుంచైనా పుస్తకాలు, వార, పక్ష పత్రికలు తెప్పించుకోవాలంటే ఐదు కిలోల బరువున్న పార్శిల్‌కు గతంలో రూ.80 చెల్లించేవారని, ఇప్పుడు అదే బరువు కలిగిన పార్శిల్‌కు రూ.365 చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిజిస్టర్ బుక్‌పోస్టు ద్వారా 200 పేజీల పుస్తకాన్ని జీఎస్టీతో కలిపి రూ.25కు పంపేవారు. ఇప్పుడు ఆ సర్వీసును తపాలాశాఖ రద్దు చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పుస్తకాన్ని రిజిస్టర్ పార్శిల్‌లో మాత్రమే అందుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రూ.100 విలువ చేసే పుస్తకాన్ని పాఠకుడెవరైనా పోస్టల్‌లో తెప్పించుకోవాలంటే రూ.80 పోస్టల్ చార్జీల కింద భరించాల్సి ఉంటుంది. ఇంత భారం భరించి పుస్తకాలను తెప్పించుకునే వారెవరుంటారు? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

దిగుమతి సుంకంపై ఆందోళన

శాంపిల్ పుస్తకాలపై 5 శాతం దిగుమతి సుంకం విధించడం మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ప్రాంతీయ భాషలో ముద్రించిన పుస్తకాలను విదేశీ భాషల్లోకి అనువాదం చేసి

బుక్‌పోస్ట్ బరువు	పాతధర	కొత్తధర
100 గ్రాములు	రూ.22	రూ.28
1 కేజీ	రూ.27	రూ.92
2 కేజీ	రూ.43.50	రూ.163
3 కేజీలు	రూ.56.40	రూ.234
4 కేజీలు	రూ.67	రూ.304
5 కేజీలు	రూ.79	రూ.365

ప్రచురిస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో విదేశీ పబ్లిషర్లు ఆ పుస్తకాల కాంప్లిమెంటరీ కాపీలను పంపుతుంటారు. ఇలా విదేశాల నుంచి వచ్చే పుస్తకాలపై తొలిసారి కేంద్రం దిగుమతి సుంకం విధించింది. వాణిజ్య ప్రయోజనాలతో విక్రయించేందుకు ఉద్దేశించిన పుస్తకాలపై దిగుమతి విధించడం సమర్థనీయమే అయినా కాంప్లిమెంటరీగా పంపే పుస్తకాలపై సుంకం పేరిట అదనపు భారం మోపడం దుర్మార్గమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పుస్తకాలకు దూరం చేయడమే..



కేంద్రం తీసుకున్న కొత్త నిర్ణయంతో పాఠకులు పుస్తక పఠనానికి దూరమవుతారు. ఇది సరైన నిర్ణయం కాదు. మరిన్ని రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాల్సింది పోయి ఇలా చేయడం సరికాదు. ధరలు పెంచితే పుస్తకాలు కొనేదెవరు, తెప్పించుకునేదెవరు. ఇప్పటికైన కేంద్రం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

– హరికృష్ణారెడ్డి, రచయిత